సరోజ ఇలా ఆలోచిస్తూడగానే అ ఇంట్లోంచి చెదిరిన జుట్టుతో అస్తవ్యస్తంగా ఉన్న చీరతో బుల్లెట్లా పరుగెత్తుకుంటూ రాంబాబు వచ్చాడు.

రాంబాబు సరోజ కారు ఉన్న వైపే వేగంగా పరుగెత్తుకురాసాగాడు.

సరోజ కారు స్టార్ట్ చేసి విండోలోంచి చెయ్యి ఊపుతూ గట్టిగా పిలిచింది.

'రాంబాబు .....క్విక్ ..... ఇలారా.....'

కారులోంచి పిలుస్తున్న సరోజని చూడగానే రాంబాబుకి ప్రాణం లేచొచ్చింది.

గబగబ కారెక్కి సరోజ పక్కన కూర్చున్నాడు.

'త్వరగా కారుని పోనియ్.....' రొప్పుతూ అరిచాడు రాంబాబు.

సరోజ కారుని రివర్స్ చేసి రివ్వున ముందుకు దూకించింది.

'ఎక్కడికి?' అడిగింది.

'శ్యామ్రావు ఇంటికే.......' భయంగా వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు.

'ఎవరైనా ఫాలో అవుతున్నారా?.....'

'ఉహూ.....' అన్నాడు స్థిమితంగా కూర్చుంటూ.

'వాళ్లు నిన్ను గుర్తుపట్టారా?' కొన్ని క్షణాల నిశ్శబ్దం అనంతరం అడిగింది సరోజ.

'లేదు .....గుర్తుపడ్తే చంపేసి ఉండేవారు'

'మరి నిన్నెందుకు తీసుకెళ్లారు?' ఆశ్చర్యంగా అతని వంక చూసింది.

రాంబాబు జరిగిందంతా చెప్పాడు.

అటువంటి పరిస్థితిలోనూ ఫకాల్మని నవ్వింది సరోజ.

రాంబాబు కూడా సరోజ నవ్వుతో శృతి కలిపాడు.

'అయితే పాపం వాళ్ళు నీ శీలాన్ని దోచుకోకుండానే వచ్చేశావన్న మాట!!' అంది నవ్వాపుకుంటూ.

రాంబాబు సిగ్గుపడ్డాడు.

కారు శ్యామ్రావు ఇంటిముందు ఆగింది. కారు దిగి ఇద్దరూ లోపలికి అడుగు పెట్టారు. లోపలి దృశ్యం చూడగానే రాంబాబు గుండె ఆగినంత పనయ్యింది.

లోపల పరంధామయ్య, పార్వతి జయంతితో మాట్లాడుతున్నారు కిష్టయ్య కూడా వాళ్లతో ఉన్నాడు.

'అడుగో ... రాంబాబు వచ్చాడు.....' అరిచాడు కిష్టయ్య గుమ్మంలో నిలబడ్డ రాంబాబుని చూస్తూనే .

రాంబాబు కంగారు పడ్డాడు. ఇప్పుడు గనక తాండ్రి చేతిలో పడితే తన పని అయినట్టే, ఇక్కడ నుండి పారిపోవాలి.

'రాంబాబా.... రాంబాబెవరూ?....'

అమ్మాయిని నన్ను పట్టుకుని రాంబాబంటాడేమిటి ఈ అబ్బాయి?! ..... హి..... ఎక్కడో

పిచ్చివాడిలా ఉన్నాడు....హిహి.....పదవే సరోజా ....మీ ఇంటికి వెళ్దాం.....' ఆడగొంతుతో అన్నాడు రంబాబు కంగారుగా.

'నీ వ్యవహారం మొత్తం మాకు తెలిసిందిగానీ ఇలా రావోయ్.....' అన్నాడు కొడుకుతో పరంధామయ్య.

రాంబాబు కిష్టయ్య వంక చూశాడు.

'మన ఊరికి మీ గురించి పోలీసులు వచ్చారట గురూగారూ....వాళ్ల దగ్గర విషయం తెల్సుకుని కంగారుపడి వచ్చారు. నేను అంతా వివరంగా చెప్పాను....' అన్నాడు కిష్టయ్య.

'ఏ పాపం ఎరగని నీకీ కష్టాలేంట్రా బాబూ?.....' పార్వతి రాంబాబుని కౌగిలించుకొని కన్నీళ్ళు పెట్టుకుంది.

'మన కష్టాలు ఎక్కువ కాలం ఉండవులే అమ్మా..... ఈ రోజే స్మగ్లర్ల స్థావరం కనుక్కున్నాం.

త్వరలో హంతకుడిని కూడా కనుక్కుని నా నిర్దోషిత్వాన్ని నిరుపించుకుంటాను అన్నాడు రాంబాబు.

అవును గురూగారూ...అసలేం జరిగింది?' కిష్టయ్య ఆతృతగా అడిగాడు.

'ఆ వ్యవహారాలన్ని తర్వాత మాట్లాడూకుందాంగానీ ముందు ఆ ఆడవేషం తీసిరా..... చూడలేక చస్తున్నాం....' అన్నాడు పరంధామయ్య.

'మీరలా అంటున్నారుగానీ అంకుల్.....దొంగల ముఠా వాళ్ళు ఈయన్ని ఈ వేషంలో చూసి ఎంతగా మోజు పడ్డారో తెల్సా.....' సరోజ నవ్వుతూ అంది.

అంతసేపూ కొడుకు గొడవలో పట్టించుకోలేదుగానీ ఆమెని అప్పుడే చూశాడు పరంధామయ్య.

''ఈ అమ్మాయి ఎవరూ?' రాంబాబుని చూస్తూ ఆడిగాడు.

రాంబాబు 'హి....' అని వెర్రి నవ్వొకటి నవ్వి తల వంచుకుని బొటన వేలితో నేలమీద రాశాడు.

'ఆ చేష్టలేంటి, ఆ వ్యవహారం ఏటి.....నల్లులేమైనా నలుపుతున్నావా?..... ఏరా కిష్టయ్య ఇందాక ఈ అమ్మాయి గురించి చెప్పలేదేం.....' అన్నాడు పరంధామయ్య కిష్టయ్య వంక సూటిగా చూస్తూ.

కిష్టయ్య కూడా తల వంచుకుని 'హిహి.....' అని బొటన వేలుతో నేలమీద రాశాడు.

ఇదో వెర్రిమేళం వ్యవహారంలా ఉంది. అడిగిందానికి సమాధానం ఇవ్వకుండా బొటన వేలుతో నేలమీద అలా రాయడం ఏమిటి?' పరంధామయ్య మండిపడ్డాడు.

'చూస్తుంటే అర్థం కాలేదూ?....' అంటూ పార్వతి పరంధామయ్య చెవిలో ఊదింది.

'ఉహూ....నేనొప్పుకోను.....' అన్నాడు పార్వతితో పరంధామయ్య.

'ముందు మనవాడు ఈ చిక్కుల్లోంచి బయటపడనీండి, అప్పుడు ఈ విషయం గురించి

ఆలోచిద్దాం అంది పార్వతి.

రాంబాబు లోపలికి వెళ్లి డ్రెస్ మార్చుకున్నాడు.

శ్యామ్రావు స్టూడియో నుండి లంచ్ కోసం ఇంటికి వచ్చాడు.

జయంతి అందరికీ భోజనాలు వడ్డించింది.

భోజనాలయ్యాక రాంబాబు అందరికీ తన కిడ్నాప్ ఉదంతం చెప్పాడు.

'ఇంక నీలిమని చంపిన హంతకుడెవరో తెలుసుకుంటే పూర్తిగా సమస్య తీరిపోయినట్టే!.....' అన్నాడు రాంబాబు.

'ఇలోగా ఈ స్మగ్లర్ల గురించి పోలీసులకి ఇన్ఫార్మ్ చేస్తేనో?.....' అన్నాడా శ్యామ్రావు.

'వద్దు.... పోలీసులు వాళ్లందర్నీ పట్టుకుంటే రాంబాబు మీద స్మగ్లింగ్ నేరం పోతుంది గానీ నీలిమని హత్య చేశాడన్న నేరం మాత్రం అలానే ఉంటుంది. నీలిమని హత్య చేసిన హంతకుడు ఆ గ్యాంగ్లోనే ఉండి ఉంటాడు. వాడెవడో ఆధారాల్తో పట్టుకున్నాక అప్పుడు పోలీసులకి చెప్దాం .....' అంది సరోజ.

'వీరూ దగ్గర నీలిమ డైమండ్ నెక్లెస్ దొరికినంత మాత్రానా వీరూనే నీలిమని హత్య చేశాడని అనడానికి వీల్లేదు....వీరూ నీలిమ ఇంట్లో కేవలం దొంగతనం చేసి ఉండవచ్చు. హత్య చేసింది వేరేవాళ్లు అయిఉండవచ్చు.

'అదే ఇప్పుడు మనం తేల్చాల్సింది.' అంది సరోజ.

'ఇక వస్తాంరా అబ్బాయ్' అంటూ లేచాడు పరంధామయ్య.

'ఎక్కడికండీ?....' అంది జయంతి.

'మావాడి ఇల్లు చిక్కడపల్లిలో ఉందిగా అక్కడ ఉంటాంలే అమ్మా' అంది పార్వతి.

'ఈ గొడవ తేలేంతదాకా మా ఇంట్లోనే ఉండండి ....' అన్నాడు వాళ్లతో శ్యామ్రావు.

'వద్దులే బాబూ...నీకెందుకు అనవసరం శ్రమ .....' అన్నాడు పరంధామయ్య.

పరంధామయ్య, పార్వతి, కిష్టయ్య ముగ్గురూ వెళ్లిపోయారు.

అప్పుడు రాంబాబుకి హఠాత్తుగాగుర్తుకు వచ్చింది.

'అవునూ నువ్వు ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలని నన్ను పార్కుకి రమ్మన్నావుగా ఏమిటది?......'

సరోజ చెప్పింది.

రాంబాబు ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని విన్నాడు.

## *ఫ్రేమ్ - 32*

### *పిచ్చి కుదిరింది!*

లేడిస్ హాస్టల్లో.......

సుబ్బలక్ష్మి తల వొంచుకుని మౌనంగా నిల్చుని ఉంది.

వర్ధనమ్మ మంచం మీద కూర్చుని ఉంది. రాఘవేంద్రరావు గదిలో విసురుగా అటూ ఇటూ

పచార్లు చేస్తున్నాడు.

'ఎందుకడీ అలా ఊర్కే కాళ్ళు పడిపోయేలా తిరుగుతారు?' అది వర్ధనమ్మ భర్తతో.

'తిరక్క...... ఇలాంటి పరిస్థితిలో చేతులు ముడుచుకుని కూర్చోవాలా?.....హు.......' అన్నాడు రాఘవేంద్రరావు.

'మీరిలా తిరిగినంతమాత్రాన పరిస్థితులు చక్కబడ్తాయా?....కాస్సేపు కూర్చోండి లేపోతే కాళ్ళు నెప్పులు పుడ్తాయి......'

'మీకేం మీరలానే అంటారు ..... మళ్ళీ కాళ్ళు పట్టేది నేనేగా.....'

'అక్కర్లా..... నేనే పట్టుకుంటా ....' చికాగ్గా అన్నాడు.

'పోనీ నేను పట్టనా నాన్నా!' అంతదాకా మౌనంగా ఉన్న సుబ్బలక్ష్మి అడిగింది.

'నువ్వు కాళ్ళు కాదు...... నా పీక పట్టు పీడావదిలిపోతుంది..... అసలు వాడు....వాడి పేరేంటి?'

'నాగరాజు!.....' సుబ్బలక్ష్మి మళ్ళీ తల వొంచుకుంది.

'ఆ..... ఆ నాగరాజు నీకెలా పరిచయం అయ్యాడే?....' కోపంగా అడిగాడు రాఘవేంద్రరావు.

'మరేమో....మరేమో.....ఒకరోజు కాలేజీకి వెళ్తుంటే దార్లో నా జేబురుమాలు నా చేతిలోంచి జారి క్రిందపడిపోయింది.... అప్పుడు నా వెనకాల వస్తున్న నాగరాజేమో.....'

'అసలు వాడు నీ వెనకాల ఎందుకొస్తున్నాడూ?' మండిపడ్డాడు రాఘవేంద్రరావు.

'అబ్బబ్బ.....దాన్ని చెప్పేది చెప్పనివ్వరేం?..... అది రోడ్డు కదా....ఎంతోమంది ముందూ, వెనకా నడుస్తూ ఉంటారు ..... ఊ ......చెప్పవే.........' అంది వర్ధనమ్మ.

'అప్పుడేమో వెనుకాల వస్తున్న నాగరాజేమో ఆ రుమాలు కింద నుండి తీసి ఎవండీ.....ఇది మీ రుమాలేనా అని అడిగాడు.....'

'నాది కాదని అనేయాల్సింది...పోతేపోయింది వెధవ రుమాలు.....ఊ తర్వాతేం జరిగింది?'

'నాదే అన్నాను......'

'ఊ......'

'అతను జేబురుమాలు ఇచ్చేసి ఏ కాలేజీ అని అడిగాడు. నేనేమో చెప్పాను. మీకు తోడుగా అక్కడదాకా వస్తాను మళ్ళీ ఏమైనా పడేస్కుంటా రేమో!!..... అన్నాడు.....పాపం ఈయనెంత మంచాడో అని సరే అన్నాను.....'

'ఊ.....ఇంకా?.....' పళ్ళు నూరుతూ అడిగాడు.

'అలారెండు మూడు రోజులు నాకు కాలేజీదాకా తోడువచ్చాక మీరు ఇందిరా పార్కు చూశారా అని అడిగాడు...నేను చూడలేదని చెప్పాను. అర్రే...... ప్రపంచంలో కల్లా గొప్ప పార్కు మీరు చూడలేదా ....నేను చూపిస్తాను రండి అన్నాడు. ఇందిరా పార్కుకి పోయాం శ్రమ అని

అనుకోకుండా నన్ను తీస్కెళ్లాడు.... అక్కడ బఠానీలు కొని పాపం తను కొంచెమే తిని నాకు అన్నీ ఇచ్చేశాడు....'

'ఊ......ఇంకా.....? ..... పళ్ళు పటపటలాడించాడు రాఘవేంద్రరావు.

'అప్పటి నుండీ మేం ప్రేమించుకున్నాం......'

'వాడి దగ్గర బఠానీలు తిన్నాక ప్రేమ కలిగిందన్న మాట?..... దీన్ని బఠానీ ప్రేమంటారా?'

'కాదు నాన్నా ..... బఠనీలు తిన్నాక వేరుశెనక్కాయలు కూడా తిన్నాం.... ఆ తర్వాతే ప్రేమించుకున్నాం ' సిగ్గుపడుతూ అంది సుబ్బలక్ష్మి.

రాఘవేంద్రరావు తల అపట్టుకుని కూర్చుంటే ఏం లాభం?..... ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించండి.....' అంది వర్ధనమ్మ.

'చెయ్యడానికేముందీ ? ..... ఆ నాగరాజుని పట్టుకొని బాబూ, అయ్యా.....మా అమ్మాయి జీవితం నాశనం చెయ్యకు.....దాని వెళ్ళో మూడో ముప్పైయ్యో ముళ్ళు వెయ్యి బాబూ అని గెడ్డం పుచ్చుకుని బ్రతిమ లాడాలి.....ఏవే సుబ్బూ....ఆ నాగరాజు అడ్రసన్నా తెల్సా అదీ తెలీదా?......' అన్నాడు రాఘవేంద్రరావు.

'తెల్సు నాన్నా.....' అని నాగరాజు అడ్రసు ఇచ్చింది సుబ్బలక్ష్మి.

ముగ్గురూ ఆటోలో నాగరాజు ఇంటికి బయలుదేరారు.

* * *

నాగరాజు మరోసారి అద్దంలో మొహం చూస్కున్నాడు .

అతని దవడ ఓ ప్రక్క వాచిపోయి ఉంది. ఒక కన్ను చుట్టూ చల్లగా చక్రంగా కమిలిపోయి ఉంది.

'ఈ ..... పళ్ళు బయట పెట్టి చూస్కున్నాడు. చిగుళ్ళలోంచి కాస్త కాస్త రక్తం కారుతూంది. బొటన వ్రేలితో ముందు పళ్లని మెల్లగ నొక్కి చూశాడు. పళ్ళు కాస్త కదులుతున్నాయ్.

నాగరాజుకి దుఃఖం ముంచుకొచ్చింది.

అతనికి అరగంట క్రితం జరిగిన సంఘటన కళ్లముదు గిర్రున తిరిగింది.

నాగరాజు సరోజ ఇంటికి వెళ్ళాడు. అతను వెళ్లేసరికి సరోజ మంచంమీద పడుకుని నవలేదో చదువుకుంటోంది. అడుగుల చప్పుడుకి తలెత్తి చూసింది సరోజ. ఎదురుగా నాగరాజు కనిపించాడు.

'నువ్వా?......మళ్ళీ ఎందుకొచ్చావ్?' మంచం మీదనుండి లేచి కూర్చుంటూ అడిగింది.

'నీ మనసు మార్చుకున్నా వేమోనని అడగడానికి వచ్చాను.....నువ్వుప్రేమించిన రాంబాబు ఎలాగూ నీకు దక్కడు. అతని మీద ఇదివరకు కేవలం హత్యానేరం మాత్రమే ఉండేది. ఇప్పుడు అతనిపై స్మగ్లింగ్ నేరం కూడా ఉంది..... నువ్వు ప్రేమించిన వాడిని ఎలాగూ పొందలేవు....కనీసం నిన్ను ప్రేమించే నన్నైన చేసుకుని సుఖపడు......' అన్నాడు నాగరాజు.

‘నిన్ను చేసుకోవడం అనేది ఎన్నటికీ జరగని పని. రాంబాబు హంతకుడు కాదు, స్మగ్లరూ కాదు. ఒకవేళ అయినా కూడా అతన్నే చేస్కుంటా.....’

‘ప్లీజ్ సరోజా ....నా మాట విను..... అతను ఉరికంబం ఎక్కడం ఖాయం...నా ప్రేమని కాదనకు.....’

‘మరి నువ్వు సుబ్బలక్ష్మి ప్రేమని కాదన్నావుగా.....’

‘సుబ్బలక్ష్మిని నేనేమీ ప్రేమించలేదు.... అదేనా వెంట తిరిగింది.... ప్లీజ్ సహ....నన్ను ప్రెమించవూ?....’ రెండడుగులు ముందుకు వేస్తూ అన్నాడు నాగరాజు.

‘నిన్ను నేను ప్రేమిస్తాలే......’

ఆ మాటలు వెనుక నుండి వినిపించాయ్.

నాగరాజు వెనక్కి తిరిగి చూశాడు. గుమ్మంలో భీమేశ్వరరావు కండలు సవరించుకుంటూ నిలబడి ఉండడం చూశాడు.

‘రారా అన్నయ్యా.....బావేదో ప్రేమా దోమా అంటున్నాడుకానీ కాస్త అతని సంగతి చూడు.

భీమేశ్వరరావు ముందుకు వచ్చి పిడికిలి బిగించి నాగరాజు మొహం మీద ఒక్క గుద్దు గుద్దాడు.

‘అబ్బా!....’ అన్నాడు అద్దంలో చూస్కుని గతం నెమరు వేస్కుంటున్న నాగరాజు.

ఇంతటి అవమానానికి పాల్పడిన సరోజని చేసుకోవడం ఇంక జరగని పని.

అటు సరోజా దక్కలేదు....ఇటు ప్రేమించిన సుబ్బలక్ష్మినీ చేజేతులా దూరం చేసుకున్నాడు. ఒకసారి చీదరించుకుని వెళ్లగొట్టిన సుబ్బలక్ష్మి దగ్గరికి ఇప్పుడే ముఖం పెట్టుకుని వెళ్లడం?.....

అలా ఆలోచిస్తూ అద్దలో ముఖం చూస్కుంటున్న నాగరాజుకి అద్దంలో సుబ్బలక్ష్మి కనిపించింది వెనక్కి తిరిగి చూశాడు.

గది మధ్యలో సుబ్బలక్ష్మి నిల్చుని ఉంది. ఆమె వెనకాల మధ్య వయస్కులైన ఒకాయనా, ఒకామె ఉన్నారు.

‘సుబ్బూ......’ నాగరాజు ఆనందంగా అన్నాడు.

‘నాగూ.....’ అంది సుబ్బలక్ష్మి ప్రేమగా.

‘వాళ్లెవరు సుబ్బూ?’

‘మా అమ్మా నాన్నా ..... నీ గురించి చెప్తే విషయం తేల్చుకుందామని వచ్చారు.......’

నాగరాజు వాచిన దవడని ఓసారి తడుముకుని ‘నన్ను క్షమించండి మామగారూ...... నాకు బుద్ధొచ్చింది....ఇన్నాళ్ళూ సుబ్బలక్ష్మి ప్రేమ విలువని గ్రహించలేక పోయాను.....’ అంటూ రాఘవేంద్రరావు కాళ్లమీద పడ్డాడు నాగరాజు.

***డైరీలో ఏముంది?***